డిగ్రీ నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల, జూలై 22(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలలకు సంబంధించి నాలుగో సెమిస్టర్ ఫలితాలను మంగళవారం వర్సిటీ అధికారులు విడుదల చేశారు. ఈ పరీక్షలు ఏప్రిల్ 7 నుంచి 21 వరకు నిర్వహించారు. రెగ్యులర్ విధానంలో 6,972 మంది పరీక్షలకు హాజరుకాగా 42.47 శాతం పాసయ్యారు. 4,837 మంది సప్లిమెంటరీ పరీక్షలు రాయగా 55.53శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. వెబ్‌సైట్‌లో ఉన్న ఫలితాలపై ఎలాంటి సందేహాలున్నా నిర్దేశించిన 15 రోజుల్లో ఫీజు చెల్లించి పునఃమూల్యాంకనానికి దరఖాస్తు చేసుకోవాలని వర్సిటీ అధికారులు తెలిపారు.

విదేశీ పక్షులకు విడిది ఎలా?



తెలుకుంచిలో విదేశీ పక్షులు

- వైసీపీ పాలనలో కేంద్రాలపై తీవ్ర నిర్లక్ష్యం
- కనీస స్థాయిలో మంజూరుకాని నిధులు
- వసతులు లేక తప్పని ఇబ్బందులు
- ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వినతులు

టెక్కలి రూరల్/ ఇచ్ఛాపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): విదేశీ విహంగ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కనుమరుగయ్యాయి. జిల్లాలోని ఇచ్ఛాపురం మండలం తేలుకుంచి, టెక్కలి మండలం తేలినీలాపురం గ్రామాలు విదేశీ పక్షుల విడిది కేంద్రాలుగా ప్రసిద్ధి చెందాయి. ఇవి పర్యాటక కేంద్రాలుగా కూడా భాసిల్లాయి. ఏటా సైబీరియా, జర్మనీ, ఆస్ట్రేలియా, సింగపూర్, మలే షియా, హంగేరి దేశాల నుంచి వేలాది కిలోమీటర్లు ఎగురుకుంటూ పెలికాన్, పెయింటెండ్, స్టార్క్ జాతులకు చెందిన పక్షులు ఇక్కడికి విడిది కోసం వస్తాయి. ఏటా సెప్టెంబరులో వచ్చి సంతానోత్పత్తి చేసి.. వాటి పిల్లలతో తిరిగి ఏప్రిల్ పయనమవుతాయి. స్థానికులను, పర్యాటకులను కనువిందు చేస్తాయి. కాగా, వైసీపీ ప్రభుత్వ హయాంలో పక్షుల విడిది కేంద్రాల నిర్వహణ పట్టించుకోలేదు. దీంతో సంరక్షణ కరువై వందలాది పక్షులు మృత్యువాత చెందాయి. అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని అటవీశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపినా మంజూరైన దాఖలాలు లేవు. నిర్వాహకులకు కూడా జీతాలు అందే పరిస్థితి లేదు.

● పర్యాటకాభివృద్ధికి అవకాశం

టీడీపీ ప్రభుత్వ హయాంలో తేలుకుంచి కేంద్రాన్ని పర్యాట కంగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. కానీ 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి. వైసీపీ పాలనలో పర్యాటక శాఖకు ఎటువంటి నిధులు (మిగతా 6వ పేజీలో..)

● తేలినీలాపురంలో ఇలా..

1986లో తేలినీలాపురానికి చెందిన కొంతమంది రైతుల వద్ద మూడు ఎకరాల భూమి తీసుకుని పక్షుల విడిది కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దట్టమైన చెట్లు పెంచి, పక్షులకు అవసరమైన ఏర్పాట్లు చేయడంతో ఎక్కడ చూసినా సందడిగా కనిపించేవి. వీటిని చూసేందుకు పర్యాటకులు కూడా తరలివచ్చేవారు. ప్రస్తుతం సౌకర్యాలు లేక అటు విదేశీ పక్షులకు, ఇటు పర్యాటకులకు ఇబ్బందులు తప్పడం లేదు. చుట్టూ ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదించినా నిధులు మంజూరు కాలేదు. ప్రస్తుతం ఇనుప కంచెలు వేసినా అవి తెగిపోవడంతో ఇతరులు లోపలకు వచ్చి.. పక్షులను వేటాడే పరిస్థితు లు ఉన్నాయి. పక్షులను చూసేందుకు పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన టవర్ సైతం శిథిలావస్థకు చేరుకుంది. మరుగుదొడ్లు నిర్మించినా తలుపులు లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. పక్షులు సేదతీరేందుకు ఏర్పాటు చేసిన ఇనుప జాలులు తుప్పుపట్టాయి. పిల్లలు ఆడుకునే పార్క్‌ను సైతం నిర్లక్ష్యంగా వదిలేశారు. పర్యాటకుల కోసం నిర్మించిన విశ్రాంతి షెడ్‌లు పాడైపోయాయి. ఈ కేంద్రం నిర్వహణకు, పక్షుల సంరక్షణ కోసం గ్రామానికి చెందిన ఇద్దరిని నియమించారు. వారికి నెలకు రూ.9వేలు చొప్పున వేతనం అందజేస్తామని ప్రకటించారు. కానీ మూడేళ్లుగా వారికి వేతనాలు ఇవ్వకపోవడంతో అవస్థలు పడుతున్నారు.

తేలుకుంచికి విదేశీ అతిథులొచ్చేశాయ్

విదేశీ విహంగాల రాక ప్రారంభమైంది. ఇచ్ఛాపురం మండలంలోని తేలుకుంచి పరిసర ప్రాంతాల్లో పక్షుల కిలకిలరావాలు వినిపిస్తున్నాయి. సైబీరియా, జర్మనీ, ఆస్ట్రేలియా, సింగపూర్, మలేషియా, హంగేరి దేశాల నుంచి సుమారు 6వేల కిలోమీటర్లు ప్రయాణించి ఏటా సెప్టెంబరు, అక్టోబరులో ఇక్కడకు పక్షులు చేరుతాయి. సుమారు ఆరేడు నెలలపాటు ఇక్కడే ఉండి గుడ్లు పెట్టి సంతానోత్పత్తి జరుపుతాయి. పిల్లలు పెద్దాయ్యాక.. మార్చి, ఏప్రిల్‌లో తిరుగు పయనమవుతాయి. ఈసారి కాస్త ముందుగానే పక్షులు తమ గ్రామానికి చేరుకుంటున్నాయని తేలుకుంచి గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇవి వస్తే పంటలు బాగా పండుతాయని తమ ప్రగాఢ నమ్మకమని చెబుతున్నారు.

● ముందస్తు చర్యలు చేపడితేనే..

ప్రస్తుతం తేలుకుంచిలో విదేశీ పక్షుల రాక ప్రారంభమైంది. మరో నెలరోజుల్లో తేలినీలాపురానికి కూడా రానున్నాయి. సంతానోత్పత్తి చేసే క్రమంలో గుడ్లుతో పాటు పక్షులు చెట్లపై నుంచి జారిపడి మృత్యువాత చెందుతుంటాయి. అందుకే ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. కనీసం చెట్లకు వలలు ఏర్పాటు చేసినా కొంతవరకూ పక్షుల మృత్యువాత అడ్డుకోవచ్చు. దీనికితోడు కోతులతో పక్షులకు కష్టాలు తప్పడం లేదు. కేంద్రం నిర్వహణ సక్రమంగా లేక వాటి మలమూత్ర విసర్జనతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. కనీసం చుట్టుపక్కల ప్రాంతాల్లో చెరువులను అభివృద్ధి చేస్తే పక్షులకు కొంతవరకూ ఉపయోగపడే అవకాశముంది. ఆ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



తేలినీలాపురంలో పాడైన ఇనుప జాలులు, అధ్వానంగా విశ్రాంతి గది



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పారిశుధ్యంపై నిర్లక్ష్యాన్ని సహించం

- గార, హిరమండలం ఎంపీడీవోలపై కలెక్టర్ ఆగ్రహం
- ఎరువుల కొరత రానీయొద్దని స్పష్టం

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 22(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్యం, మురుగుకాలువల శుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ.. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన గార, హిరమండలం ఎంపీడీవోలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు సక్రమంగా నిర్వహించకపోతే కఠినచర్యలు తప్పవని స్పష్టం చేశారు. పీఆర్జీఎస్, కోర్టు కేసులు, ఎరువుల పంపిణీ, పీ-4 సర్వే పురోగతి వంటి అంశాలపై చర్చించారు. 'మండలస్థాయి అధికారులు సిబ్బందితో, అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని ముందుకు సాగాలి. ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి. సమస్యల పరిష్కారం ఫాస్ట్‌ట్రాక్‌లో జరగాలి. కోర్టు కేసులపై అధికారులు సకాలంలో స్పందించాలి. ప్రభుత్వ పనితీరుపై ప్రజలు సానుకూల దృక్పథంతో ఉండేలా పనిచేయాలి. నీటి నాణ్యత పరీక్షలు, కాల్వలు, హాస్టళ్ల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఎరువుల పంపిణీలో కొరత వినిపించడానికి వీల్లేదు. ఎరువుల సరఫరాపై రోజువారీ నివేదికలు సమర్పించాలి. ఉపాధిహామీ పథకం కింద తుప్పల తొలగింపు, రోడ్ల వెంట మొక్కలు నాటడం వంటి పనులు చేపట్టాలి. పీ-4 సర్వే నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలి. బంగారు కుటుంబాలను యాప్‌లో నమోదు చేయాలి. ఈ నెలాఖరుకి మార్గదర్శుల గుర్తింపు పూర్తిచేయాల'ని స్పష్టం చేశారు. సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్ కుమార్, డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, ఉప కలెక్టర్లు బి.పద్మావతి, జయదేవి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించి.. కూలీలతో ముచ్చటించి

- బోరుభద్ర, ఉమిలాడల్లో నేషనల్ లెవల్ మోనటింగ్ బృందం సభ్యుల పర్యటన

శ్లాబు పెచ్చులూడి.. భవనం శిథిలావస్థకు చేరి

- ఇదీ నందిగాం-1, 2 గ్రామ సచివాలయాల పరిస్థితి

8లో

ఎంఈవోలకు ముఖహాజరు తప్పనిసరి

- ఉదయం 9గంటలకే ఎమ్మార్సీ సిబ్బందికి విధులు
- పనితీరు మెరుగుకు ప్రభుత్వం చర్యలు
- రోజుకో పాఠశాల తనిఖీ చేయాల్సిందే

నరసన్నపేట, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖ అధికారులతోపాటు, ఎమ్మార్సీలో పనిచేస్తున్న సిబ్బంది ఇక నుంచి ఉదయం 9 గంటలకు ఆన్‌లైన్‌లో ముఖహాజరు తప్పనిసరిగా వేయాలని విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఆదేశాలు జారీ చేశారు. ఎంఈవోలు రోజూ ఏదో ఒక పాఠశాలను తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. పాఠశాలల పర్యవేక్షణ, విద్యాపథకాల అమలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయుల పనితీరు, ప్రమాణాలను పర్యవేక్షించే బాధ్యత ఎంఈవోలదే. అలాగే క్లస్టర్‌స్థాయిలో విద్యా ప్రమాణాలను మెరుగుపడేందుకు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసేందుకు సీఆర్‌పీ వ్యవస్థను పదేళ్ల కిందట ఏర్పాటు చేశారు. వైసీపీ పాలనలో ప్రతీ మండలానికి అదనంగా ఎంఈవో-2ను నియమించారు. ఈ లెక్కన జిల్లాలో 30 మండలాలకు ఇద్దరేసి ఉన్నారు. అయినా పాఠశాలల పర్యవేక్షణ గాడిన పడలేదు. పైగా ఇద్దరు ఎంఈవోలు ఉండంతో జిల్లాలో పలు మండలాల్లో వారి మధ్య ఆధిపత్యపోరు మొదలైంది. ఇంకోవైపు చాలామంది ఎంఈవోలు స్థానికంగా ఉండడం లేదు. జిల్లా, డివిజన్ కేంద్రంలోనే నివాసం ఉంటున్నారు. దీనితో పనివేళలు పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు జిల్లాకేంద్రంలో ఉంటూ ఇక్కడి నుంచే ఏదో ఒక పనికారణం చూపి ముఖహాజరు నమోదు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఎంఈవోలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదులు రావడంతో కమిషనర్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. దీని ప్రకారం ఎమ్మార్సీలో పనిచేస్తున్న సీఆర్‌పీలు, ఆపరేటర్లు, ఇతర కిందస్థాయి సిబ్బందికూడా ఉదయం 9గంటలకు ముఖ హాజరు వేయాల్సి ఉంటుంది.

● ఈ విషయమై డీఈవో ఎస్.తిరుమల చైతన్య వద్ద ప్రస్తావించగా.. 'ఎంఈవోలు, ఎమ్మార్సీ సిబ్బంది కూడా ప్రతిరోజు ఉదయం 9 గంటలకు ఎమ్మార్సీలకు వెళ్లి ముఖహాజరు వేయాలని, రోజూ ఒక పాఠశాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలని ఇటీవల కమిషనర్ ఆదేశాలను జారీచేశారని తెలిపారు. ఈ ఆదేశాలు అమలు చేస్తామన్నారు.



హాజరు, తనిఖీలపై రోజూ నివేదిక

ఎంఈవోలు తోచిన కారణాలు చెప్పి తప్పించుకోవడానికి అవకాశం లేకుండా కమిషనర్ చర్యలు చేపట్టారు. టీచర్ల మాదిరిగానే ఉదయం 9.30 గంటలకు ఎంత మంది ఎంఈవోలు హాజరు వేసిందీ జిల్లా విద్యాశాఖ ప్రతిరోజూ కమిషనరేట్‌కు నివేదిక పంపించాలి. ప్రతిరోజూ ఒక పాఠశాలను ఎంఈవో తప్పనిసరిగా తనిఖీ చేయాలి. గతంలో కొందరు ఎంఈవోలు మండల కేంద్రాలు లేదా డివిజన్ కేంద్రం నుంచి ఎప్పుడో బయలుదేరి దగ్గర ఉన్న పాఠశాలలకు వెళ్లి తూతూ మంత్రంగా తనిఖీలు చేసి హాజరైనట్లు నమోదు చేసుకునేవారు. ఇప్పుడు అలాకాకుండా ఎంఈవోలకు జీపీఎస్ విధానం అమలు చేస్తున్నారు. ఎమ్మార్సీలకు వెళ్లినా, పాఠశాలలకు వెళ్లినా.. అక్కడి లోకేషన్ చూపిస్తుంది. తాజా ఉత్తర్వులతో కొంతమంది ఎంఈవోలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.



సీఎం చంద్రబాబుకి సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

ఉద్దానం-2 ప్రాజెక్టుకు రూ.265 కోట్లు కేటాయించాలి

- సీఎం చంద్రబాబును కోరిన ఎమ్మెల్యే ఎంజీఆర్

7లో

ఆ భూమి మాదిరో.. హక్కు లేదురో

- ఇదీ ఉద్దానం రైతుల ఆవేదన

ముహూర్తం ముందరున్నదీ!

- శ్రావణ మాసంలో వివాహాలు, గృహ ప్రవేశాలతో సందడి

ఏఎన్ఎంల బదిలీలపై కలెక్టర్ గరంగరం!

- డీఎంహెచ్‌వోకు మందలింపు
- ఇప్పటికీ వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు

6లో



ఇచ్ఛాపురంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం

సొంతగూడు ఒక్కటీ లేదు

- అద్దె భవనాల్లో ఎక్సైజ్ స్టేషన్లు
- జిల్లాలో 12 చోట్లా ఇదే పరిస్థితి..
- సీజ్ చేసిన వాహనాలకు భద్రత కరువు

ఇచ్ఛాపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. జిల్లాలో 12 స్టేషన్లు ఉండగా, ఒక్కదానికీ సొంత భవనం లేదు. సీజ్ చేసిన వాహనాలు ఆరుబయటే ఉంచటంతో.. వాటికి భద్రత కరువవుతోంది. ఇచ్ఛాపురం, సోంపేట, పలాస, టెక్కలి, నరసన్నపేట, కోటబొమ్మాళి, ఆమదాలవలస, పాతపట్నం, కొత్తూరు, రణస్థలం, పొందూరు, శ్రీకాకుళంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌స్టేషన్లు ఉన్నాయి. చాలాచోట్ల శిథిలావస్థ భవనాల్లోనే స్టేషన్లు నిర్వహిస్తున్నారు. అరకొర వసతులతో ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని కార్యాలయాల్లో శ్లాబ్‌ల పెచ్చులూడి పోతున్నాయి. ఇచ్ఛాపురంలో సురంగిరాజులకు చెందిన పురాతన భవనంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం 20ఏళ్లుగా కొనసాగుతోంది. ఇక్కడ కనీస సౌకర్యాలు లేక సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది అవస్థలు పడుతున్నారు. సుమారు వందేళ్ల కిందట నిర్మించిన భవనం కావడం, శిథిలావస్థకు చేరుకోవడంతో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. అలాగే గంజాయి, మద్యం, సారా వంటి మాదక ద్రవ్యాలు, రకరకాల కేసుల్లో పట్టుబడిన వాహనాలు సీజ్ చేస్తే వాటిని ఆరుబయటే ఉంచాల్సి వస్తోంది. వాటికి భద్రత (మిగతా 6వ పేజీలో..)

ఆరేళ్లయినా..

- పూర్తికాని ఉప్పుటేరు వంతెన
- మత్స్యకారులకు తప్పని అవస్థలు

సోంపేట, రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): అది రెండు మండలాలను కలిపే రహదారి. పదులసంఖ్యలో గ్రామాలకు ఇదే ప్రధాన మార్గం. కానీ ఉప్పుటేరు కారణంగా రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనిపై వంతెన నిర్మాణం ప్రారంభించి ఆరేళ్లయినా.. పనులు పూర్తికాని దుస్థితి నెలకొంది. ఇదీ సోంపేట మండలంలోని ఎకువూరు, ఎర్రముక్కాం మత్స్యకార గ్రామాల మధ్య ఉప్పుటేరుపై వంతెన నిర్మాణ వ్యథ. మందస, సోంపేట మండలాల్లో ఉద్దానం, మత్స్యకార గ్రామాలను కలుపుతూ 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం లింకు రహదారులను ఏర్పాటు చేసింది. రట్టి, బారువ రహదారి నుంచి తోటవూరు మీదుగా సుమారు 1.7 కిలోమీటర్ల పొడవునా రోడ్డు నిర్మాణ పనులను ఆరేళ్ల కిందట రూ.6కోట్ల వ్యయంతో ప్రారంభించింది. ఇంతలో 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. 2024 ఎన్నికలకు ముందు వైసీపీ ప్రభుత్వం హడావుడి చేసింది. కానీ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. వంతెన నిర్మాణం పూర్తయితే పదుల సంఖ్యలో గ్రామాలకు, మందస, సోంపేట మండలాల పరిధిలోని సిరమామిడి, ఉప్పలాం పంచాయతీ పరిధిలో మత్స్యకారులకు మేలు కలుగుతుంది. కేవలం కిలోమీటరు దూరంలో ఉన్న ఎకువూరు వెళ్లాలంటే చుట్టూ తిరిగి 5 కిలోమీటర్లు దూరం ప్రయాణించాల్సి వస్తోంది. మత్స్యకారులు కూడా తాము సేకరించిన చేపలను విక్రయించేందుకు, రవాణా చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పనులు పూర్తి కాకపోవడంతో కొద్దిపాటి వర్షాలకు తోటవూరు వద్ద రోడ్డు చిత్తడిగా మారుతోంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా స్పందించి ఈ వంతెన నిర్మాణం పూర్తిచేయాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ డీఈఈ రవికుమార్ వద్ద ప్రస్తావించగా.. 'కాంట్రాక్టర్ సగంలో పనులు వదిలేశాడు. సకాలంలో పనులు పూర్తికాక నిధులు వెనక్కి మళ్లాయి. నిధుల విడుదలకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామ'ని తెలిపారు.



ఉప్పుటేరు వద్ద నిలిచిన వంతెన పనులు

ఇల్లంటే ఇల్లూ కాదు..!

- ధాన్యం నిల్వలకు రైతుల ఏర్పాట్లు
- మట్టితో నిర్మాణాలు
- కనుమరుగవుతున్న వైనం


పెద్దపద్మాపురంలో మట్టితో నిర్మించిన కొట్టు గది

మెళియాపుట్టి, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర-ఒడిశా సరిహద్దులోని గ్రామాల్లో మీరు ఎప్పుడైనా పర్యటించారా? ఆ గ్రామాల్లో ఇళ్ల ముందు మట్టితో రూపు దిద్దుకున్న గుడిసెల్లాంటి నిర్మాణాలను గుర్తించారా? పెద్ద పెద్ద తలుపులు... ద్వారాలకు బదులు చిన్న కిటికీల లాంటివి కనిపించాయా? అంత చిన్న కిటికీల్లోంచి లోపలికి వెళ్లడం... బయటకు రావడం చాలా కష్టం కదూ అనిపించిందా? దీని కోసం ఆ ఇంటిలోని వారు ఎంత కష్టపడుతున్నారో అనిపిస్తోంది కదూ. వాస్తవానికి అవి ఇల్లు గానీ... గుడిసెలు గానీ కాదు. రైతులు ధాన్యం నిల్వ చేసుకునేందుకు ఏర్పాటు చేసుకున్న నిర్మాణాలు. ఒకవిధంగా ధాన్యం నిల్వ చేసుకునేందుకు మట్టితో నిర్మించిన గోదాంలు. వీటికి 'కొట్టుగదులు లేదా కొట్టు' అని స్థానికంగా పిలుస్తారు. పూర్వం నుంచి రైతులకు రెండు విధాలుగా ధాన్యం నిల్వ చేసుకోవడం అలవాటు. ఒకటి పాతరగా వ్యవహరిస్తారు. ఈ పాతరలు ఎక్కువగా ఇళ్ల ముందే తవ్వేవారు. ఈ విధానంలో పెద్ద గొయ్యి తీసి... గడ్డి చుట్టలుగా చుట్టి... ఆ గోతిలో పెట్టి... ఆ నడుమ ధాన్యాన్ని ఆరు నెలలకు పైగా నిల్వ ఉంచడం. రెండోది మట్టితో ఓ గుడిసెలా నిర్మించి... అందులో ధాన్యం నిల్వ ఉంచడం. కొన్నాళ్ల పాటు వీటిలో నిల్వ ఉంచాక...ఆ పైన ధాన్యాన్ని మిల్లుకు తరలించి... తమ అవసరాలకు ఉపయోగపడే బియ్యంగా తయారు చేసుకోవడం. ఈ విధానం వల్ల పురుగులు ఆశించకపోవడమే కాకుండా... పోషకాలూ పెరుగుతాయని సంబంధిత నిపుణులు చెబుతున్నారు. సుమారు పదేళ్ల కిందటి వరకూ దాదాపు ప్రతి గ్రామంలోనూ రైతులు ధాన్యం నిల్వలకు వీటిపైనే ఆధారపడే వారు. ఇటీవల కాలంలో మాత్రం ధాన్యాన్ని నూర్పులు పూర్తయిన వెంటనే అమ్మేస్తున్నారు. బియ్యాన్ని బయట కొనుగోలు చేసుకుంటున్నారు. మట్టిలో ధాన్యం నిల్వలను జిల్లాలో మెళియాపుట్టి, మందస, ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, కొత్తూరు, సోంపేట ఎక్కువగా చేసేవారు. ప్రస్తుతం పక్కా ఇళ్ల నిర్మాణంతో పాటు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు పెరిగాయి. పొలాల్లో పంటలతో వీటి ఏర్పాటుకు అవకాశం ఉండడం లేదు. దీంతో పాతరలకు స్వస్తి చెప్పాల్సి వస్తోందని రైతులు అంటున్నారు.

ఆ భూమి మనదిరో.. హక్కు లేదురో

- ఇదీ ఉద్దానం రైతుల ఆవేదన
- అధికారుల తప్పిదంతో అన్నదాతకు శాపం

కవిటి, జూలై 22(ఆంధ్రజ్యోతి): బొరివంక గ్రామానికి చెందిన బి.పద్మనాభానికి అదే రెవెన్యూలో 1.19 ఎకరాల భూమి ఉంది. కానీ రెవెన్యూ రికార్డుల్లో నోషనల్ ఖాతాల్లోకి విస్తీర్ణం మారింది. అలా ఎందుకు మారిందో తెలియదు. ఆ భూమిపై ఎలాంటి లావాదేవీలు చేసేందుకు వీలు లేకుండా పోయింది.

ఇద్దివానిపాలెం గ్రామానికి చెందిన కె.కూర్మయ్య, కృష్ణమూర్తిలకు 70సెంట్ల భూమి ఉంది. సాగు చేస్తున్నదీ వారే. కానీ రికార్డుల్లో మాత్రం వారికి భూమి లేనట్టుగా చూపిస్తోంది. ఈ భూమిలో సాగు తప్ప ఎటువంటి లావాదేవీలు చేయడానికి అవకాశం లేదు. దీని వల్ల భూములు ఉన్నా..లేనట్టుగా ఇబ్బంది పడాల్సి వస్తోంది.

..ఇదీ కవిటి మండలంలోని బొరివంక, బి.గొనపపుట్టుగ, లోళ్లపుట్టుగ, బొగిడియాపుట్టుగ, ఇద్దివానిపాలెం గ్రామాలకు చెందిన సుమారు 400 మంది రైతుల ఆవేదన. ఈ రైతులకు వారసత్వంగా వచ్చిన భూములతో పాటు కొనుగోలు చేసిన వీ ఉన్నాయి. రెవెన్యూ అధికారులు చేసిన తప్పిదం వారికి శాపంగా మారింది. కొన్నేళ్ల కిందట నోషనల్ ఖాతాలతో పాటు జీరో ఎక్స్‌టెంట్ భూములు సరిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అందుకు అనుగుణంగా గ్రామ స్థాయిలో వీఆర్ఓలు చేయాల్సిన సకాలంలో పనులు చేయకపోవడంతో ఇప్పుడు రైతులు అధికా రుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వాలు, అధికారులు మారుతున్నా రైతుల సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. వీరిలో బొరివంక రెవెన్యూ పరిధిలో ఇద్దివానిపాలెం గ్రామానికి చెందిన 17 మందికి సున్నా విస్తీర్ణం చూపిస్తోంది. మ్యానువల్ పద్ధతిలో రెవెన్యూ అధికారులు ఇచ్చిన పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నా వీరి భూములు మాత్రం రెవెన్యూ రికార్డుల్లో నోషనల్ ఖాతా (ప్రభుత్వ ఖాతా)లకు మారిపోయి ఉన్నాయి. అడంగల్ కాపీలు, 1బిలు రాకపోవటం... ప్రభుత్వ భూములుగా చూపిస్తుండటంతో రైతులంతా లబోదిబోమంటున్నారు. భూములపై ఎలాంటి రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకోలేకపోతున్నామని వాపోతున్నారు. అంతేకాదు... పిల్లల పెళ్లిళ్లు... అనారోగ్య సమస్యల వంటివి ఎదురైనపుడు భూములను విక్రయించేందుకు కూడా అవకాశం ఉండడం లేదు. దీంతో అప్పులపాలవుతున్నారు. బొరివంక రెవెన్యూ పరిధిలో 208 మంది ఈ ఏడాది ప్రారంభం నుంచి సమస్యను పరిష్కరించాలని అధికారులకు మొర పెట్టుకుంటున్నారు. మరోవైపు రైతుల వివరాలు, నివేదికలు సిద్ధం చేసి కలెక్టర్‌కు సమర్పించామని స్థానిక అధికారులు చెబుతున్నా నేటికీ సమస్య పరిష్కారం కావటం లేదు. ఇదిలా ఉండగా... ఇదే పరిధిలోనున్న ఒకరిద్దరు రైతుల వివరాలు రహస్యంగా మార్పులు జరిగాయని కొంతమంది రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

నోషనల్ ఖాతాలోకి..

నోషనల్ ఖాతా (ప్రభుత్వ భూమి)లో ఇక్కడి భూములు నమోదయ్యాయి. దీంతో రైతుల ఆధీనంలో భూమి ఉన్నప్పటికీ వారి పేరున ఎలాంటి రికార్డు లేకుండా పోతుంది. ప్రభుత్వ భూమిగా ఉండడం వల్ల ఎటువంటి రుణం గానీ, ప్రభుత్వ సాయం గానీ పొందే అవకాశం ఉండదు. దీనిపై కవిటి తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డులు పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు పంపించారు. ఆర్డీవో, జాయింట్ కలెక్టర్ పరిశీలించి ఆమోదం తెలిపితే తప్ప స్థానిక రెవెన్యూ రికార్డుల్లో రైతుల పేర్లు మార్పు కావు.


బొరివంక రెవెన్యూ పరిధిలోని భూములు

విదేశీ పక్షులకు విడిది ఎలా?

(ఐదో పేజీ తరువాయి)

కేటాయించలేదు. అటవీ, పర్యాటక శాఖ సంయుక్తంగా చర్యలు చేపడితే విదేశీ పక్షుల విడిదికేంద్రాలు అభివృద్ధి చెందే అవకాశముంది. దీనిపై కూటమి ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎంతో నమ్మకం..

విదేశీ పక్షులు వస్తే ఈ ప్రాంతంలో సమృద్ధిగా పంటలు పండుతాయని ప్రగాఢ నమ్మకం. కానీ ఈ కేంద్రంలో పక్షులు పడే బాధలు వర్ణనాతీతం. సరైన ఏర్పాట్లు లేకపోవడంతో చెట్లపై నుంచి జారిపడి సంతానోత్పత్తి గుడ్లు పగిలిపోతుంటాయి. పక్షులు సైతం మృత్యువాత పడుతుంటాయి. ఆ సమయంలో చాలా బాధేస్తోంది.

- మేరుగు సూర్యనారాయణ, తేలుకుంచి

ప్రభుత్వం దృష్టిపెట్టాలి

విదేశీపక్షుల విడిది కేంద్రంపై టీడీపీ ప్రభుత్వ హయాంలో కనీసం పర్యవేక్షణ అయినా ఉండేది. వైసీపీ పాలనలో కనీసస్థాయిలో విదేశీ పక్షులకు సంరక్షణ లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం ఈ విదేశీ పక్షుల కేంద్రంపై దృష్టిపెట్టాలి.

- నారాయణ, తేలుకుంచి

వసతులు లేవు



పక్షుల విడిది కేంద్రంలో వసతులు లేక పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేయాలి.

- వై.రాజారావు, తేలినీలాపురం

జీతం ఇవ్వడం లేదు



రెండేళ్ల నుంచి జీతం లేక ఇబ్బందులు పడుతున్నాను. వసతిగృహం నిర్మాణానికి 70 సెంట్ల భూమి ఇచ్చాను. ఉపాధి కోసం ప్రతి నెల జీతం ఇస్తామని చెప్పారు. కానీ రెండేళ్ల నుంచి జీతం అందడం లేదు.

ఉప్పాడ భీమారావు, నిర్వాహకుడు, తేలినీలాపురం

భద్రతకు చర్యలు

తేలుకుంచి విదేశీ పక్షుల విడిది కేంద్రంపై ప్రత్యేక దృష్టిపెట్టాం. అటవీ శాఖపరంగా మొక్కలు కూడా నాటి సంరక్షిస్తున్నాం. పక్షుల భద్రతకు చర్యలు తీసుకుంటున్నాం. శాశ్వత నిర్మాణాలకు సంబంధించి ప్రతిపాదనలు చేశాం. త్వరలో వాటికి మోక్షం కలుగుతుందని ఆశిస్తున్నాం.

- ఎ.మురళీకృష్ణ నాయుడు, అటవీ రేంజ్ అధికారి, కాశీబుగ్గ

ప్రతిపాదనలు పంపించాం

తేలినీలాపురం అభివృద్ధికి ప్రతిపాదనలు పంపాం. నిర్వాహకుల జీతాల కోసం మా పై అధికారులకు తెలియజేస్తున్నాం. పక్షులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

- కృష్ణారావు, అటవీశాఖ సెక్షన్ అధికారి, టెక్కలి

ఆరుద్ర పురుగు వచ్చిందోచ్


నీలాపురం పొలాల్లో కనిపించిన ఆరుద్ర పురుగు

పలాస, జూలై 22(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలకు సమీప ంలోని పంట పొలాల్లో ఆరుద్ర పురుగులు కనువిందు చేస్తున్నాయి. వర్షాలు కురుస్తుండడంతో వాతావరణం, నేల చల్లబారడంతో ఈ పురుగులు బయటకు వస్తున్నాయి. ఇవి కనిపిస్తే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, పంటలు బాగా పండుతాయని రైతుల నమ్మకం. అందంగా, కుంకుమ రంగులో కనిపించే ఆరుద్ర పురుగులను రైతు నేస్తాలుగా చెబుతారు. ఇవి నేలను గుల్లబారకుండా చేసి పంటకు పోషకాలు అందించడంలో సహకరిస్తాయి. అందుకే వీటిని పర్యావరణ నేస్తాలని కూడా పిలుస్తారు. చాలా ఏళ్ల తరువాత ఈ పురుగులు మళ్లీ కనిపిస్తున్నాయని రైతులు చెబుతున్నారు. మున్సిపాలిటీ పరిధి నీలాపురం గ్రామ సమీప పంట పొలాల్లో ఆరుద్ర పురుగులు సందడి చేస్తున్నాయి.

సొంతగూడు ఒక్కటీ లేదు

(ఐదో పేజీ తరువాయి)


ఇచ్ఛాపురం ఎక్సైజ్ స్టేషన్‌లో ఆరుబయటే సీజ్ చేసిన వాహనాలు

కరువైంది. వాహనాల విడి భాగాలు, టైర్లు చోరీకి గురయ్యాయి. ఉన్నతాధికారులు స్పందించి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లకు సొంత భవనాలు సమకూర్చాలని పలువురు కోరుతున్నారు.

- ఈ విషయమై ఇచ్ఛాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.దుర్గాప్రసాద్ వద్ద ప్రస్తావించగా.. 'ఇచ్ఛాపురంలో సురంగి రాజావారి కోటలో ఎక్సైజ్ స్టేషన్‌ను నిర్వహిస్తున్నాం. వర్షాలు కురిసేటప్పుడు శ్లాబ్ పెచ్చులూడుతుంటాయి. అంతే తప్ప. మరీ ఇబ్బందులు పడే పరిస్థితి లేదు. సీజ్ చేసిన మద్యాన్ని, గంజాయి, గుట్కా వంటివి గదుల్లో భద్రపరుస్తున్నాం. ప్రత్యేక షెడ్లు లేకపోవడంతో సీజ్ చేసిన వాహనాలను ఆరుబయట ఉంచాల్సి వస్తోంద'ని తెలిపారు.

ముహూర్తం ముందరున్నదీ!

- శ్రావణ మాసంలో శుభముహూర్తాలు
- వివాహాలు, గృహ ప్రవేశాలతో సందడి



కోటబొమ్మాళి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సుమారు రెండు నెలల విరామం తరువాత మళ్లీ పెళ్లి బాజాలు మోగనున్నాయి. ఊరూవాడా సందడి కనిపించనుంది. మే నెలతో ముహూర్తాలు ముగియడంతో వివాహాలు, శుభకార్యాలకు విరామం వచ్చింది. శ్రావణ మాసం ఆరంభం నుంచి శుభ ముహూర్తాలు ఉండటంతో పట్టణాలతో పాటు పల్లెల్లోనూ కల్యాణ మండపాలను సిద్ధం చేస్తున్నారు. వివాహాలతో పాటు గృహ ప్రవేశాలకూ బలమైన ముహూర్తాలు ఉన్నట్లు కోటబొమ్మాళికి చెందిన పురోహితుడు సుసరాపు చంద్రశేఖర్ శర్మ తెలిపారు.

నెలల వారీగా ముహూర్తాలు

- జూలైలో 26, 30, 31 తేదీలు
- ఆగస్టులో 1, 3, 5, 7, 8, 9, 10, 11, 12, 13, 14, 17.
- సెప్టెంబరులో 24, 26, 27, 28 .
- అక్టోబరులో 1, 2, 3, 4, 8, 10, 11, 12, 22, 24, 29, 30, 31.
- నవంబరులో 1, 2, 7, 8, 12, 13, 15, 22, 23, 26, 27, 29, 30.

కల్యాణ మండపాలు.. కష్టమే

వర్షాకాలం కావడంతో వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఎక్కువ మంది కల్యాణ మండపాలకు ప్రాధాన్యమిస్తున్నారు. జిల్లాలో 600కు పైగా కల్యాణ మండపాలు ఉన్నాయి. అవన్నీ ఇప్పటికే సంబంధిత తేదీలకు ముందస్తుగా బుక్ చేసుకున్నారు. మొక్కులు ఉన్నవారు తిరుపతి, సింహాచలం, అన్నవరం తదితర పుణ్య క్షేత్రాల్లో వివాహాలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



చేతినిండా పని..

పెళ్లిళ్ల సీజన్ వచ్చిందంటే ట్రావెల్స్, పురోహితులు, ఫొటోగ్రాఫర్లు, వంటవారు, పూలు, వస్త్ర, బంగారం దుకాణదారులు, బ్యూటీషియన్లు, ఆర్కెస్ట్రా నిర్వాహకులు, బ్యాండు, సన్నాయి మేళం కళాకారులకు చేతినిండా పని ఉంటుంది. దాదాపు రెండు నెలలుగా ఖాళీగా ఉన్న వీరందరికీ వచ్చే నవంబరు నెలాఖరు వరకు చేతి నిండా పని లభించనుంది.

ముఖ్యమైన తేదీలు ఇవీ

జూలై 26, 31 తేదీలు, ఆగస్టు 9న శుభముహూర్తాల్లో జిల్లా వ్యాప్తంగా వందలాది జంటలు వివాహ బంధంతో ఒక్కటి కానున్నాయని పురోహితులు చెబుతున్నారు. గృహప్రవేశాలకు ఈ నెల 30తో పాటు ఆగస్టు 3, 9 తేదీల్లో అనువైన మహూర్తాలు ఉన్నాయి. కొత్తగా ఇళ్లు నిర్మించుకున్న వారంతా శుభ సమయాల్లో గృహ ప్రవేశాలు చేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



శాకంబరిగా దుర్గాదేవి

శ్రీకాకుళం కల్చరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎ.పి.హెచ్.బి. కాలనీలోని షిర్డిసాయి ఆలయంలో ఉన్న దుర్గాదేవికి వివిధ రకాల కూరగాయలతో శాకంబరిగా మంగళవారం అలంకరించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఏఎన్‌ఎంల బదిలీలపై కలెక్టర్ గరంగరం!

- డీఎంహెచ్‌ఓను మందలించిన వైనం
- ఇప్పటికీ వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు
- డబ్బులు తీసుకుని న్యాయం చేయలేదంటూ ఓ ఏఎన్‌ఎం నిలదీత

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 22(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ ఏఎన్‌ఎంల బదిలీలపై పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అర్ధరాత్రి కౌన్సెలింగ్‌తో హడావుడిగా బదిలీలు చేపట్టారని, పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడినట్లు నేటికీ ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారితో పాటు కార్యాలయ సిబ్బందిని కలెక్టర్ మంగళవారం తన కార్యాలయానికి పిలిపించి తీవ్రంగా మందలించినట్లు తెలిసింది. కచ్చితమైన తుది జాబితా తయారు చేసి అందజేయాలని ఆదేశించారు. దీంతో హడావుడిగా జాబితాలు తయారు చేస్తున్నట్లు భోగట్టా. ఇప్పటికీ కొంతమందికి బదిలీకి సంబంధించిన పత్రాలు అందలేదని వాపోతున్నారు. ఈ సందర్భంగా ఓ ఏఎన్‌ఎం నేరుగా డీఎంహెచ్‌ఓను కలెక్టరేట్ పాత గ్రీవెన్స్ హాలులో నిలదీసినట్లు తెలిసింది. డబ్బులు అందజేసినా సరే పని జరగలేదని ఆమె నిలదీసినట్లు చర్చించుకుంటున్నారు. ఎన్నడూ లేని విధంగా నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు జరిగాయని, ఏం చేయాలో పాలుపోని పరిస్థితిలో డీఎంహెచ్‌ఓ కార్యాలయ సిబ్బంది సెలవుపై వెళ్లేందుకు సిద్ధమవుతున్నారని తెలుస్తోంది. ఈ వ్యవహారంలో కార్యాలయానికి చెందిన ఓ అధికారి సూత్రధారిగా వ్యవహరించారని తెలుస్తోంది. ఇప్పటికీ ప్రతి రోజు ఏఎన్‌ఎంలు జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయానికి బదిలీ సమస్యలపై వస్తున్నారని, ఫిర్యాదు చేస్తున్నారని కార్యాలయ వర్గాలే చెబుతుండడం గమనార్హం. ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశిస్తే నిజానిజాలు బయటపడే అవకాశం ఉందని బాధితులు కోరుతున్నారు.


కలెక్టరేట్ పాత గ్రీవెన్స్ హాల్‌లో బదిలీ జాబితాలు తయారు చేస్తున్న దృశ్యం


బారులుతీరిన భక్తులు

ముత్యాలమ్మతల్లికి ఆషాఢ పూజలు



శ్రీకాకుళం కల్చరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని జెడ్పీకి వెళ్లే దారిలో ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి మంగళవారం ఆషాఢ మాస పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. మహిళలు ముర్రాటలతో పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. పసుపు నీటిని అమ్మవారి పాదాలపై చల్లి చల్లదనం చేసి... మొక్కులు చెల్లించుకున్నారు. జంగిడీలు మోస్తూ ముత్యాలమ్మతల్లి వద్దకు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. రెడ్డిక వీధిలో ఉన్న దుర్గాదేవికి ఆవేటి సంబరాల్లో భాగంగా పూజలు చేశారు. వీటితో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు.

'బంగారుతల్లి' కుటుంబాలకు మార్గదర్శకుల చేయూత

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

గార, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పీ-4 సర్వేలో భాగంగా గుర్తించిన బంగారు తల్లి కుటుంబాలకు మార్గదర్శకులు చేయూతను అందించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మంగళవారం పీ-4 సర్వేపై పంచాయతీ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. అనంతరం గ్రామంలో బంగారు తల్లి కుటుంబాలను కలిసి వారితో మాట్లాడారు. ఇన్‌చార్జి ఎంపీడీవో ఐ.రఘు మాట్లాడుతూ.. మండలంలోని పీ-4 సర్వేలో 2,743 మంది బంగారు కుటుంబాలను గుర్తించామని, 175 మంది మార్గదర్శకులుగా ముందుకు వచ్చారన్నారు. గారలో పీస మన్మథరావు తన ఇంటి ముందు నిర్మించిన ఇంకుడు గుంతను కలెక్టర్ పరిశీలించి ఆయనను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ మార్పు దుర్గాపృథ్వీరాజ్, మాజీ సర్పంచ్ బడగల వెంకటప్పారావు, తహసీల్దార్ చక్రవర్తి, పీ-4 సర్వే ప్రత్యేకాధికారులు డాక్టర్ పీటీ బాలకృష్ణ, నక్క రామకృష్ణ, ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో వి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.


బంగారు కుటుంబాలతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

నేర నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలి

● ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని, ఆలయాలు, చర్చిలు, మసీదులు వంటి ప్రార్థనా మందిరాల్లో సంబంధిత నిర్వాహకులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. మంగళ వారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నేరాలు, మాదక ద్రవ్యాల నియంత్రణ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, నాన్ బెయిల్ బుల్ వారెంట్ల అమలు, సీసీ కెమెరాల ఏర్పాటు, విజబుల్ పోలీసింగ్, కార్డన్ సెర్చ్ తదితర అంశాలపై డీఎస్పీలు, సీఐలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ఫిర్యాదులను స్వీకరించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలన్నారు. మహిళలు, ఫిర్యాదుదారుల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిల్‌బుల్ వారెంట్లు త్వరితగతిన అమలు పర్చాలన్నారు. వాహనాలను తనిఖీ చేపట్టి గంజాయి రవాణా, క్రయ విక్రయాలకు పాల్పడుతున్న నిందితులను గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు.


సమీక్షలో పాల్గొన్న పోలీసు అధికారులు, మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఉద్దానం-2 ప్రాజెక్టుకు రూ.265 కోట్లు కేటాయించాలి

● సీఎం చంద్రబాబును కోరిన ఎంజీఆర్

శ్రీకాకుళం, జూలై 22(ఆంధ్రజ్యోతి): పాతపట్నం నియోజకవర్గ ప్రజలకు తాగునీరందించేందుకు గాను ఉద్దానం ప్రాజెక్టు-2 పూర్తి చేసేందుకు రూ.265 కోట్లు కేటాయించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని అమరావతిలో మంగళ వారం కలిసి వినతిపత్రం అందించారు. పాతపట్నం నియోజకవర్గ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. గొట్టా బ్యారేజీ ఏప్రాన్ నిర్మాణం చేపట్టాలని, అంబావిల్లి వంతెనకు నిధులివ్వాలని, సీఎంఆర్ఎఫ్ ద్వారా పలువురికి సహకారం కావాలని విన్నవించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి

గార రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ గంగరాజు అన్నారు. ఈ మేరకు మంగళవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆటో యూనియన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ.. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రైవర్ పక్క ప్రయాణి కులను ఎక్కించి పట్టుబడితే అపరాధ రుసుం విధిస్తామన్నారు.

పూర్వపు ఎంపీడీవో కార్యాలయానికి స్టేషన్ తరలింపు

వంశధార నదిపై గార-వనితమండలం గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా అప్రోచ్ రోడ్డు ఏర్పాటుకు గాను ప్రస్తుతం ఉన్న పోలీస్ స్టేషన్ తొలగించనున్నారు. ఈ నేపథ్యంలో స్టేషన్‌ను పాత ఎంపీడీవో కార్యాలయంలోకి మార్చనున్నారు. సంబంధిత భవనాన్ని ఇంజనీరింగ్ అధి కారులతో కలిసి ఎస్ఐ గంగరాజు మంగళ వారం పరిశీలించారు. కొత్త భవనం నిర్మించే వరకు ఈ భవనంలో విధులు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

ఇసుక అక్రమ తవ్వకాలు ఎవరు చేసినా తప్పే

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్

ఆమదాలవలస, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుకను ఎవరు అక్రమంగా తవ్వకాలు చేసినా తప్పేనని మాజీ ఉపముఖ్యమంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నిమ్మతొర్లాడ వద్ద నిర్వహిస్తున్న ఇసుక ర్యాంప్‌ను మంగళవారం వైసీపీ నేతల తో కలిసి పరిశీలించారు. ఇటీవల ర్యాంప్ నిర్వాహకులకు, గ్రామస్థులకు వివాదం చెలరేగి కొట్లాటకు దారి తీసిన నేపథ్యంలో గాయపడిన గ్రామస్థులను పరామర్శించారు. ఇసుక అక్రమ తవ్వకాలపై సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ స్పందించాలన్నారు. నిబంధన లను విస్మరించి తాగునీటి పంపుహౌస్‌లో ఉన్న ప్రాంతాలను కూడా చూడకుండా తవ్వకాలు చేపట్టడం దారుణమని, తక్షణం విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ సమన్వయ కర్త చింతాడ రవికుమార్, పలువురు నేతలు పాల్గొన్నారు.

ఏడాదిలో ఎలాంటి అభివృద్ధి లేదు

ఎచ్చెర్ల, జూలై 22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిలో ఎక్కడా అభివృద్ధి, సంక్షేమం జరగలేదని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. ఎచ్చెర్ల, చిలకపాలెం, ఎస్ఎం పురం, కేశవరావు పేటల్లో మంగళవారం బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

ఎట్టకేలకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

కంచిలి, జూలై22(ఆంధ్రజ్యోతి): పెద్ద శ్రీరాంపురం పంచాయతీలో విద్యుత్ లో ఓల్టేజీ సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. సమస్యను అనేక పర్యాయాలు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు అవసరమని గుర్తించారు. ఈ సమస్యను స్థానికులు మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే బెందాళం అశోక్ దృష్టికి తీసుకువెళ్లగా వారు సంబంధిత అధికా రులతో చర్చించి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఆదేశించారు. దీంతో గ్రామంలో కొత్త ట్రాన్స్ ఫార్మర్‌ను మంగళవారం ఏర్పాటు చేయడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తంచేసి విద్యుత్ అధికా రులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

జీతాల చెల్లింపు సమస్యలను పరిష్కరించాలి

పాత శ్రీకాకుళం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జూలై జీతాలు బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిని పరిష్కరించాలని ఏపీటీఎఫ్ శీకాకుళం జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్ మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్వీ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల జరిగిన డిజిటల్ ఆర్గానోగ్రామ్ నవీకరణలతో పాటు, 2022 తర్వాత జారీ చేసిన డీడీవో కోడ్‌లు కలిగిన పాఠశాలలకు సంబంధిం చిన ఈ-ఆఫీస్ యూజర్ క్రెడెన్షియల్ (యూజర్ నేమ్‌లు, పాస్‌వర్డ్‌లు) అందుబాటులో లేకపోవడంతో జీతాల చెల్లింపుల్లో ఆలస్యం జరుగుతోందని వాటిని పరిష్కరించాలన్నారు.

పట్టణంలో పారిశుధ్య లోపం


● కంపుకొడుతున్న వీధులు ● కార్మికుల సమ్మె నేపథ్యంలో..

ఆమదాలవలస, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస మునిసిపాలిటీ పరిధిలోని గ్రామాలు, వీధుల్లో ఎక్కడి చెత్త అక్కడే ఉండి దుర్గంధం వెదజల్లుతోంది. గడచిన ఆరు రోజులుగా పారిశుధ్య కార్మికులు తమ సమస్యల పరిష్కా రం కోసం చేపట్టిన సమ్మె నేపథ్యం లో పారిశుధ్య పనులు నిలిచిపో యాయి. దీంతో ఏ రోడ్డు చూసినా, ఏ వీధి చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. దీనికి తోడు వర్షాలు కురుస్తుండడంతో పరి స్థితి మరింత దారుణంగా తయారైంది. పారిశుధ్య లోపం, దుర్గంధంతో వ్యాధులు ఎక్కడ ప్రబలుతాయోనని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఊసవానిపేట వద్ద ..

కాలువలోకి సాగునీరు

జి.సిగడాం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మడ్డువలస జలాశయం కుడి ప్రధాన కాలువ నుంచి ఇటీవల విడుదల చేసిన సాగునీరు కాలువలోకి చేరింది. ఖరీఫ్‌కు సాగునీరందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం తీసు కున్న చొరవతో కాలువల్లోని పూడికలను తొలగించి అభివృద్ధి చేశారు. దీంతో సాగు నీరు కాలువల్లో ప్రవహిస్తోంది. ఈ నీటితో పంటల సాగు సాధ్యపడుతుందని రైతులు అభిప్రాయ పడుతున్నారు.



ప్రజా సంక్షేమానికే ప్రాధాన్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్

సోంపేట రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. మాకన్నపురంలో మంగళవారం 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని కరపత్రాలను పంపిణీ చేసి వివరించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు, మడ్డు కుమార్, సర్పంచ్ మద్దిల నాగేశ్వరరావు, సూరాడ చంద్రమోహన్, చిత్రాడ శేఖర్, మడ్డు రాజారావు తదితరులు పాల్గొన్నారు.


కరపత్రం ఇచ్చి వివరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే శంకర్

అరసవల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి): నగరంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మంగళవారం నగరంలోని 31, 32, 34 వార్డులలో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు ఇచ్చి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, వార్డు ఇన్‌చార్జిలు విభూది సూరిబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 22(ఆంధ్రజ్యోతి): నిబంధనల మేరకు వ్యాపారాలు చేసుకోవాలని, లేకుంటే చర్యలు తప్పవని కమిషనర్ బీవీడీ ప్రసాదరావు హెచ్చరించారు. మంగళ వారం గుజరాతిపేట మెయిన్‌రోడ్డులోని ముత్యాలమ్మ మార్కెట్‌లో తనిఖీ చేపట్టారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా, మునిసిపల్ నిబంధనలకు అనుగుణంగా వ్యాపారాలు చేసుకోవాలని, షాపులను క్రమబద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఆదేశాలు బేఖాతర్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత అత్యవసరమని, నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగిస్తే భారీ జరిమానా విధించడంతో పాటు ట్రేడ్ లైసెన్స్‌ను కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


దుకాణదారులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రసాదరావు

ఐఎస్‌వో గుర్తింపుతో వర్సిటీలకు ప్రయోజనం

ఎచ్చెర్ల, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఐఎస్‌వో గుర్తింపుతో యూనివర్సిటీలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గోరఖ్‌పూర్‌కు చెందిన జీసీ కన్సల్టెన్సీ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ వికాశ్ శ్రీవాత్సవ్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూని వర్సిటీలో ఐఎస్‌వో గుర్తింపు, గ్రీన్ ఆడిట్ కోసం మంగళవారం వర్సిటీ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులతో మాట్లాడారు. వర్సిటీకి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపుతో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు, ప్రాజెక్టులు పొందేందుకు ఐఎస్‌వో గుర్తింపు అవసరమన్నారు. 14 వివిధ అంశాలను పరిగణనలోనికి తీసుకుని ఐఎస్‌వో గుర్తింపు ఇస్తారన్నారు. వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని మా ట్లాడుతూ.. వినూత్న విధానాలు పాటిస్తే వర్సిటీ మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. వర్సిటీకి జాతీయ స్థాయి గుర్తింపు లభించేలా సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎస్.ఉదయ భాస్కర్, డాక్టర్ ఎం.అనూరాధ, డాక్టర్ సీహెచ్ రాజశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వికాశ్ శ్రీ వాత్సవ్

జనవిజ్ఞాన వేదికలో చేరండి

ఆమదాలవలస, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షుడు బొడ్డేపల్లి జనార్దనరావు కోరారు. ఈ మేరకు మంగళవారం సభ్యత్వ నమోదు క్యాంపయిన్ చేపట్టారు. మూఢ నమ్మకాలను విడనాడాలన్నారు. కార్య క్రమంలో వేదిక ప్రతినిధులు సీహెచ్‌వీఎస్ మూర్తి, బెండి సర్యనారాయణ, సౌజన్య, యశశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రేపు గుర్రం జాషువా వర్ధంతి

శ్రీకాకుళం, జూలై 22(ఆంధ్రజ్యోతి): నవయుగ కవి చక్రవర్తి, కవి కోకిల గుర్రం జాషువా వర్ధంతిని శ్రీకాకుళంలో గురువారం నిర్వహించనున్నట్లు ప్రముఖ కథా రచయిత అట్టాడ అప్పల నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళ సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం సాయంత్రం జరిగే కార్యక్రమంలో ప్రముఖ కవి డా. బండి సత్యనారాయణ, పలువురు సాహితీవేత్తలు పాల్గొంటున్నారని, కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఇచ్ఛాపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు అన్నారు. నారీశక్తి కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొళిగాం హైస్కూల్‌లో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కలిగించారు. బాల్య వివాహాల వల్ల అనర్థాలు ఏర్పడతాయన్నారు. బాల్య వివాహాలకు దూరంగా ఉండాలన్నారు. కార్య క్రమంలో హెచ్ఎం నరేంద్ర పట్నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

ఆమదాలవలస, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వరి పంటలో మంచి దిగుబడి, నాణ్యమైన పంట ఉత్పత్తి కావాలంటే సస్యరక్షణ పద్ధతులను పాటించాలని ప్రకృతి వ్యవసాయ సీడీఎఫ్ చేపేన సురేష్ అన్నారు. మంగళవారం చేపేనపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో వరి పంట లో లైన్ షోయింగ్ విధానాలను రైతులతో చేయించారు. పలువురు రైతులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల పరిశీలన


పిల్లలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి

గార, జూలై 22 (ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మంలో ఉన్న నవజీవన్ చిల్డ్రన్స్ హోమ్, శిశుగృహం, బాలసదన్‌లను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు మంగళవారం పరిశీలిం చారు. పిల్లలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో ప్రత్యక్షంగా మాట్లాడి న్యాయమైన సూచనలు చేశారు. కార్యక్రమంలో న్యాయవాది జి.ఇందిరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదరికం లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలి


మాట్లాడుతున్న స్పెషలాఫీసర్ పి.సుగుణాకరరావు

రణస్థలం, జూలై 22(ఆంధ్రజ్యోతి): కోటపాలెంలో పి-4పై గ్రామ సభను మంగళవారం నిర్వహించారు. 112 బంగారు కుటుంబాలను గుర్తిస్తూ మార్గదర్శకులను ఎంపిక చేశారు. 2029 నాటికి పేదరికంగా లేని గ్రామంగా, 2047 నాటికి స్వర్ణాంధ్ర దిశగా తీర్చిదిద్దాలని నియోజకవర్గ యాక్షన్ ప్లాన్ స్పెషలాఫీసర్ పి.సుగుణాకరరావు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.జగదీశ్వరరావు, మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌పీవో గోపి బాల, ఎంపీ డీవో ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ పెంకాక్ సెలిట్ పోటీల్లో ప్రతిభ

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూలై 22(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలో జరిగిన సౌత్‌జోన్ పెంకాక్ సెలిట్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పతకాలను కైవసం చేసుకున్నారు. వీరంతా ఆంధ్ర ప్రదేశ్ తరపున పాల్గొని పతకాలు పొందారు. ఎ.సాయి ప్రశాంత్, డి.సుచరిత, కె.హరీష్ బంగారు పతకాలు కైవశం చేసుకున్నారు. డి.సుమన, ఆర్.యోగా మృత, ఎ.లలిత్ మిధిన్, పి.షాన్, కె.దీక్షిత రజిత పతకాలు సాధించారు. బి.నాగేశ్వరి, బి.జ్యోతి సాయి ప్రసాద్, ఎస్.జుజిత్ శంకర్, ఎస్.సహస్ర, బి.కార్తికేయ, పి.పవన్, పి.రాకేష్‌నాయుడు, మండా రామ్ సాయి విహాన్ శర్మ కాంస్య పతకాలు పొందారు. ఈ సందర్భంగా క్రీడాకారులను సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.దయామయ, ప్రధాన కార్యదర్శి నక్క లక్ష్మణ్ నాయుడు, కోచ్ ఎల్.ఈశ్వరరావు, హేమంత్ తదితరులు అభినందించారు.

శ్లాబు పెచ్చులూడి.. భవనం శిథిలావస్థకు చేరి

● ఇదీ నందిగాం-1, 2 గ్రామ సచివాలయాల పరిస్థితి

నందిగాం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నందిగాంలో గ్రామ సచివాలయంగా వినియోగిస్తున్న పాత పంచాయతీ భవనం శ్లాబు పెచ్చులూడుతుండడంతో సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. నందిగాం- 1, 2 సచివాలయాలు శిథిలావస్థకు చేరిన పాత పంచాయతీ భవనంలోనే కొనసాగుతున్నాయి. గత ఏడాది ఎన్నికల ముందు నందిగాం-1సచివాలయం భవనాన్ని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, అప్పటి వైసీపీ పార్లమెంట్‌ఇన్‌చార్జి తిలక్ హడావుడిగా ప్రారంభించారు.అయితే ఆభవనంలో పూర్తిస్థాయి సదుపాయాలు లేకపోయినా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. సిబ్బంది నిత్యం తిరిగేప్రాంతంలోనే భవనం పైకప్పు పెచ్చులు పడుతుండడంతో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.ఇప్పటికైనా అధికారులు నూతన సచివాలయభవనానికి హంగులు కల్పించి పాతభవనం నుంచి అక్కడకు తరలించి సిబ్బందికి, సందర్శకులకు భయాందోళన నుంచి రక్షించాలని కోరుతున్నారు.



పెచ్చులూడుతున్న నందిగాం సచివాలయ భవనం పైకప్పు

నిర్వహణ లేక.. గోతులు పూడ్చక

● పోర్టు వాహనాల వల్ల అధ్వానంగా మారిన డీపీఎన్ రహదారి

సంతబొమ్మాళి, జూలై22(ఆంధ్రజ్యోతి): మూలపేటలో నిర్మిస్తున్న పోర్టుకు భారీ వాహనాలతో కంకర తరలిస్తుండడంతో డీపీఎన్ రోడ్డుఅధ్వానంగా మారింది.కనీసం ఈరోడ్డు నిర్వహణ లేకపోవడంతోపాటు గోతులు పూడ్చక పోవడం వల్ల నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో గోతుల్లో నీరుచేరడంతో వాహనచోదకులు అగచాట్లకుగురవుతున్నారు. సింగిల్‌రహదారి కావడంతో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించడానికి డ్రైవర్లు ఇబ్బందిపడుతున్నారు. గోవిందపురం క్వారీ నుంచి పోర్టుకు భారీ వాహనాలతో నిత్యం కంకర తరలిస్తున్నారు. డీపీఎన్ రోడ్డులో నగిరిపెంట నుంచి సంతబొమ్మాళి పాలేశ్వరాలయం వరకు రహదారి పూర్తిగా అడుగడుగునా గోతులమయమయ్యింది. రోడ్డులో ఏర్పడిన పెద్ద పెద్దగోతుల్లో వర్షం నీరు చేరుతుండడంతో వాహనచోదకులు అగచాట్లకు గురవుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి ఈ రహదారిలో గోతులు పూడ్చాలని వాహన చోదకులు కోరుతున్నారు.



డీపీఎన్ రహదారిలో
పాలేశ్వరస్వామి ఆలయ సమీపాన ఏర్పడిన గోతులు

చికిత్సపొందుతూ వృద్ధురాలు మృతి

జలుమూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాలపాడుకు చెందిన తర్ర కరువమ్మ (69) చికిత్సపొందుతూ మృతి చెందింది. గ్రామస్థులు, పోలీసుల కథనం మేరకు.. కరువమ్మ కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది.ఈనేపథ్యంలో మనస్థాపానికి గురై సోమవారం ఇంటి వద్ద ఉంచిన గడ్డిమందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. దీంతో కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందింది. కరువమ్మ ముగ్గురు కుమారులు ఇదివరలోనే మృతిచెందడంతో భర్త నర్సింహులుతో జీవనం సాగిస్తోంది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు హెచ్‌సీ వెంకటరమణ తెలిపారు.

పాము కాటుతో ఒకరు..

ఎల్.ఎన్.పేట, జూలై22(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొత్తాడిసింగికి చెందిన గుమ్మడి రామకృష్ణ(44) సోమవారంరాత్రి పాముకాటు వేయడంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థుల కథనం మేరకు..రామకృష్ణ, భార్య మహా లక్ష్మి సోమవారం సాయంత్రం పొలం పనులకు బయలుదేరారు. పొలం దగ్గర కు చేరుకునే సమయంలో పాముకాటువేసింది.గుర్తించిన వెంటనే లక్ష్మీనర్సు పేట పీహెచ్‌సీకి తరలించారు.అక్కడివైద్యులు బాధితుడు రామకృష్ణకు ప్రథమ చికిత్స అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలిస్తుండగా సరుబుజ్జిలి దాటిన తర్వాత మృతిచెందడంతో మృతదేహంస్వగ్రామానికి తీసుకొచ్చారు. రామకృష్ణకు భార్య మహాలక్ష్మి, కుమారుడు పోలినాయుడు, కుమార్తె జ్ఞానేశ్వరి ఉన్నారు.

160 లీటర్ల సారా స్వాధీనం

పాతపట్నం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాల్లో సారా తయారీకేంద్రాలపై రెండురాష్ట్రాల ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా మంగళవారం దాడులు నిర్వహించారు.ఎక్సైజ్‌శాఖ శ్రీకాకుళంఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్ డి.శ్రీరామచంద్రమూర్తి, అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు, జిల్లా ఎక్సైజ్ అధికారి సీహెచ్ తిరుపతినాయుడు,గంజాం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆధ్వర్యంలో దాడులుజరిగాయి. మెళియాపుట్టి, కొత్తూరు, పలాస మండలాలు, ఒడిశాలోని సింగిపూర్, కుయారా, పెద్దబురుజోల, చిన్నబురుజోలలో ఇరు రాష్ట్రాల సిబ్బంది దాడులు చేపట్టినటు ఎక్సైజ్‌శాఖ పాతపట్నం సీఐ కోట కృష్ణారావు తెలిపారు.ఈ మేరకు12,700 లీటర్ల పులిసిన బెల్లం ఊట ధ్వంసం చేశామని, 160 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

ఇద్దరు మహిళల నుంచి..

కంచిలి/సోంపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సారా అమ్మకాలపై ఎక్సైజ్ శాఖాధికారులు మంగళవారం దాడులునిర్వహించారు. జలంత్రకోట గ్రామానికి చెందిన డొక్కరి దేవకి వద్ద నుంచి ఐదు లీటర్ల సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ జీవీ రమణ తెలిపారు. అలాగే పలాస టాస్క్‌ఫోర్స్ అధికారులు సోంపేట మండలం కొరాబంద గ్రామానికి చెందిన సవర జానకి వద్ద నుంచి 4 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారన్నారు. నిందితులను సోంపేట కోర్టులో హాజరు పరినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది భానుప్రసాద్, మార్కారావు, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాల కేసుల్లో వ్యక్తి అరెస్టు

శ్రీకాకుళం క్రైం, జూలై 22(ఆంధ్రజ్యోతి): నగరంలో పలు దొంగతనాలకు పాల్పడిన వ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు సీఐ ఈశ్వరరావు తెలిపారు. బైరివానిపేట జంక్షన్ వద్ద ఉన్న సూరా బిల్డింగ్ మార్ట్‌లో ఈనెల 14న ఎలక్ట్రికల్ వైర్ బండిళ్లు, ఎలక్ట్రికల్ సామాన్లు దొంగిలించినట్టు దుకాణం యజమాని సూర లక్ష్మణరావు ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టగా శ్రీకాకుళం రూరల్ మండలం పెద్దపాడుకు చెందిన కలగ రామును మంగళవారం పట్టుకొని వైరు బండిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.రాగోలు అగ్రికల్చరల్ రీసెర్చ్ సెంటర్‌లో ల్యాప్‌ట్యాప్, ఈ ఏడాది జనవరిలో శ్రీకాకుళం కోర్టు ఆవరణలో 32 ఇంచీల టీవీ, ఆదిత్యనగర్ కాలనీలో నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్‌లో వైరు బండిళ్లు, సంస్కార్ స్కూల్‌లో కొన్ని వైరు కట్టలు, పీఎన్‌కాలనీలో నిర్మాణంలో ఉన్న ఏపీఎం టవర్స్‌లో కొన్ని వైరు బండిళ్లను రాము దొంగిలించినట్లు గుర్తించామన్నారు. వీటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ ఈశ్వరరావు తెలిపారు. కలగ రాముపై హైదరాబాద్, విశాఖపట్నం, శ్రీకాకుళం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అనేక కేసులున్నట్టు సీఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

పలాస, జూలై 22(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ బస్టాండు సమీపంలో నందిగాం మండలంలోని సుబ్బారావుపేటకు చెందిన పి.కురవయ్యకు మంగళవారం విశాఖ డిపోకు చెందిన బస్సు ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని 108 ద్వారా ప్రథమ చికిత్స అందించి పలాస ప్రభుత్వాఆసుపత్రిలో చేర్పించారు. దీనిపై కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

టెక్కలిలో కార్డన్‌సెర్చ్

టెక్కలి, జూలై 22(ఆంధ్రజ్యోతి): టెక్కలి గొల్లవీధి పరిధిలో మంగళవారం సీఐ విజయ్‌కుమార్ నేతృత్వంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. తనిఖీలు చేసి పత్రాలు లేని 15 ద్విచక్ర వాహనాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అక్రమ మద్యం, గంజాయినిల్వలపై ఆరాతీశారు. పాత నేరస్థులు,కొత్త అనుమానిత నేర చరిత్ర కలిగిన వ్యక్తుల ఇళ్లల్లో సోదాలు నిర్వ హించారు. వారి జీవనవిధానం, వృత్తి విధానాలపై ఆరాతీశారు. చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సోదాల్లో ఎస్ఐ రాముతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



గొల్లవీధిలో కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజలకు మెరుగైన పాలన

హరిపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వమని అభివృద్ధి, సంక్షేమం అమలుచేసి ప్రజలకు మెరుగైన పాలన అందిస్తోందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషతెలిపారు.మూలిపాడులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో దుర్యోధన,తాతారావు, పీరుకట్ల విఠల్, లచ్చయ్య, నవీన్, భాస్కరరావు, మంగళిపాత్రో, నారాయణరావు పాల్గొన్నారు.

●జలుమూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకవలసలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం టీడీపీ మండలాధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గురుబెల్లి వెంకటరమణ, సర్పంచ్ తమ్మన్నగారి సతీష్, టీడీపీ నాయకులు బగ్గు గోవిందరావు, తర్ర బలరాం, పొన్నాన దాలయ్య, దేవ, దుంగ స్వామిబాబు, పంచిరెడ్డి రామచంద్రరావు పాల్గొన్నారు.

అనుచిత పోస్టింగ్‌లపై చర్య తీసుకోండి

● డీఎస్పీకి పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఫిర్యాదు



డీఎస్పీ వెంకటఅప్పారావుకు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, జూలై 22(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు పశువు కన్నా హీనమైన జంతువని, నిజాయతీగా పనిచేస్తున్న తనపై బురదచల్లుతున్నారని, తన భర్త వెంకన్నచౌదరిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని పలాస ఎమ్మెల్యే గౌతుశిరీష మండిపడ్డారు.జంటపట్టణాల్లోని లారీలకు వారివ్యక్తిగతంగా నెంబర్లువేసుకుంటే కలెక్షన్ల కోసమని వీటిని వేశారని ప్రచారంచేయడం తగదని పేర్కొన్నారు. ఈ విషయంపై లారీ యజమానులు స్పష్టంగా వివరణ ఇచ్చిన విషయాన్ని గుర్తించాలని, ఇది చాలదన్నట్లు వారి అనుచరులతో అనుచిత వ్యాఖ్యలు ఫేస్‌బుక్‌లో పెడుతున్నారని మండిపడ్డారు. ఇక నుంచి ఊరుకునేది లేదని,సోషల్‌మీడియాలో అనుచితపోస్టింగులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని డీఎస్పీ వి.వెంకటఅప్పారావుకు లిఖితపూర్వకంగా శిరీష ఫిర్యాదు చేశారు.రాజన్నటీమ్ పేరుతో ఐదేళ్లపాటు అబద్ధాలు, అసత్య ప్రచారంచేశారని, కూటమి ప్రభుత్వంలో కూడా ఆ విధానం కొనసాగిస్తామమంటే చర్యలుతప్పవని హెచ్చరించారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

అందరికి ఒప్పించి ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పోలీసులకు ఆదేశించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో ట్రాఫిక్ ఆంక్షల నేపథ్యంలో వివిధ వర్గాలతో డీఎస్పీ వి.వెంకటఅప్పారావు అభిప్రాయసేకరణ నిర్వహించారు.ఈ సందర్భంగా ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు,గాలి కృష్ణారావు, మల్లా శ్రీనివాసరావు, సప్ప నవీన్, వివిధ సంస్థల ప్రతినిధులు తమ అభిప్రాయాలు డీఎస్పీకి తెలియజేశారు.సమావేశంలో టీడీపీ నాయకులు బడ్డ నాగరాజు, ఎం.నరేంద్ర, తమ్మినేని గంగారామ్, మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు, సీఐలు పి.సూర్యనారాయణ, తిరుపతిరావు, దువ్వాడ శ్రీకాంత్, మల్లా రామేశ్వరరావు పాల్గొన్నారు.

పీఏసీఎస్ పరపతిని పెంచేందుకు కృషి చేయాలి

హిరమండలం, జూలై 22(ఆంధ్రజ్యోతి):హిరమండలం పీఏసీఎస్ పరపతి పెంచేందుకు త్రిసభ్యకమిటీలో ఎంపికైన ప్రతినిధులు కృషిచేయాలని డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, కోఆపరేటివ్ అసిస్టెంట్‌రిజిస్ట్రార్ కేవీవీ రవికుమార్ కోరారు.ఈ మేరకు పీఏసీఎస్ చైర్మన్‌గా గోళ్ల సింహాచలంతోపాటు సభ్యులుగా కరణం శశిభూషణరావు, జి.మాధవరావులు మంగళవారం ప్రమాణస్వీకారం చేశారు.కార్యక్రమంలో జడ్పీటీసీ పొగిరి బుచ్చిబాబు, తూలుగు తిరుపతిరావు, దారపు డిల్లేశ్వరరావు, చెట్టు శ్రీనివాసరావు, యాళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కిల్లిపోలమ్మకు ఆషాఢమాసం సారె సమర్పణ

టెక్కలి, జూలై 22(ఆంధ్రజ్యోతి): కొండవీధికి చెందిన గీతా మందిరం, విశ్వహిందూ పరిషత్ సభ్యులు గ్రామదేవత కిల్లిపోలమ్మతల్లికి మంగళవారం ఆషాఢమాస సారె సమర్పించారు. శ్రీకృష్ణునిని చెల్లెలు కిల్లిపోలమ్మకు పూర్వీకుల నుంచి ఆషాడమాసంలో సారె సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని కొండవీధికి చెందిన గీతామందిరం ప్రతినిధులు, వీహెచ్‌పీసభ్యులు తెలిపారు. కార్యక్రమంలో జామి మాధవి, స్వప్న, సూర్యావతి, బొడ్డ అయ్యబాబు, గేదెల చంద్రశేఖర్, చిలుకు కృష్ణారావు, ఆకుల ప్రకాష్, చంద్రశేఖర్ పట్నాయక్, మూల తాతయ్య పాల్గొన్నారు.

శాంతమ్మతల్లి నిజరూప దర్శనం

నరసన్నపేట,జూలై 22(ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలోని శాంతమ్మతల్లి ఆలయంలో ఆషాఢమాసం చివరి మంగళవారం పురస్కరించుకుని నిజరూప దర్శనం ఇచ్చారు. పట్టణంలో మహిళలు ముర్రాటలు చెల్లించి మొక్కులను తీర్చుకున్నారు. ఏటా శాంతమ్మ తల్లి నిజరూప దర్శనం పురస్కరించుకుని ఆనవాయితీగా వర్షం కురుస్తుంది. నరసన్నపేటలో వర్షం కురవడంతో శాంతమ్మతల్లి కరుణించిందని భక్తులు తెలిపారు.

యాజమాన్య హక్కులు కల్పించాలి



నిరసన తెలుపుతున్న ఈదులవలస రెవెన్యూ రైతులు

పోలాకి, జూలై 22(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఈదులవలస రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 176లో ఐదెకరాల డబ్బై ఆరు సెంట్లను రెవెన్యూరికార్డుల్లో తొలగించారని కొర్ను లచ్చయ్య, సూర్యనారాయణ, కృష్ణమూర్తి,నేతింటి జగన్నాథం, బగ్గురామారావు, తదితర రైతులు వాపోయారు. ఈమేరకు సాగుచేస్తున్న భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలని 50 మంది రైతులు సాగుచేస్తున్న పొలాల వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. దీంతో తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఆర్ఐ, సర్వేయర్, సచివాలయ సిబ్బంది రెవెన్యూ రికార్డులు పట్టుకుని ఆందోళన చేపడుతున్న ఈదులవలస కూడలికి చేరుకున్నారు. పాత రికార్డులు పరిశీలించి కొద్దిరోజుల్లో సమస్య పరిష్కరిస్తామని భరోసాఇచ్చారు.సమస్యను తహసీల్దార్ శ్రీనివాసరావుకు, రెవెన్యూ సిబ్బందికి వివరించారు. వైసీపీ హయంలో నిర్వహించిన రీసర్వేలో రెవెన్యూ రికార్డుల నుంచి సాగుదైతుల పేర్లను తొలగించారని వాపోయారు.తమ భూములను తిరిగి రికార్డుల్లో నమోదుచేయాలని, సర్వహక్కులు కల్పించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

గ్రామైక్య సంఘం అధ్యక్షురాలిగా భారతి

హరిపురం, జూలై22 (ఆంధ్రజ్యోతి):గ్రామైక్య సంఘం అధ్యక్షురాలిగా భారతి, కార్యదర్శిగా హేమలత, కోశాధికారిగా నాగరత్నంతోపాటు సభ్యులను ఎన్నుకున్నారు. మంగళవారం బేతాళపురంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామైక్య సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఏపీఎం పైడి కూర్మారావు మాట్లాడుతూ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల సమాఖ్య ప్రతినిధులు మంగమ్మ, వీవోఏ శివలక్ష్మి డిల్లేశ్వరి, శారద పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాతపట్నం, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్‌డీఎస్ ప్రాజెక్ట్ పనుల నిర్వహణవల్ల పలుగ్రామాల్లో బుధ, గురువారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటలవరకూ విద్యుత్‌సరఫరాకుఅంతరాయంకలుగుతుందని ట్రాన్స్‌కో టెక్కలి డివిజన్ ఈఈ నరసింహకుమార్ తెలిపారు.బుధవారం తిడ్డిమి, చిన్నపద్మాపురం, సవరతిడ్డిమిలో, గురువారం బైరాగిపేట, దశరధపురంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

మూడోతేదీ నుంచి యోగా పోటీలు

నరసన్నపేట, జూలై 22(ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, వివేకానంద ధాన్య యోగా సమితి ఆధ్వర్యంలో ఆగస్టు మూడో తేదీ నుంచి జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ అధ్యక్షుడు కింజరాపు రామారావు, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బొత్స కేదారీనాథ్ తెలిపారు. మంగళవారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. పోటీల్లో పది నుంచి 55 సంవత్సరాలు వయస్సు గల స్త్రీ, పురుషులకు వేర్వేరుగా ఆరు కేటగిరీల్లో పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈమేరకు నిర్వాహక కమిటీను ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా కింజరాపు రామారావు, ఉపాధ్యక్షులుగా సదాశివుని రవిప్రసాద్, పసుపురెడ్డి మల్లిబాబు, హరిబాబు, ప్రధాన కార్యదర్శులుగా పొన్నాడ దుర్గాప్రసాద్, బలగ ప్రహర్షలను నియమించారు.

నరసన్నపేటలో వర్షం

నరసన్నపేట, జూలై 22(ఆంధ్రజ్యోతి) : నరసన్నపేట,కోమర్తి, దేవాది,మాకివలస, కరగాం, తామరాపల్లి, జమ్ములో మంగళవారం వర్షం కురిసింది. ఎదలు, నారుమళ్లు ఎండిపోతున్న తరుణంలో వర్షం కురవడంతో ఊరటలభించింది.

●జలుమూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) మండలంలోని చల్లవానిపేట తదితర గ్రామాల్లో మంగళవారం కురిసిన వర్షానికి వరి ఎద పొలాల్లో నీరు చేరడంతో రైతులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వాతావరణం అనుకూలించడంతో రైతులు పొలాలు దదును చేసి దుక్కిలు చేసి వరి ఎదలు వేసుకున్నారు.అనంతరం వర్షాలు పడకపోవడంతో ఎదలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో వర్షం కురవడంతో రైతులు ఊరటచెందారు.

మాజీ సైనికుడికి నివాళి

పలాసరూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డపాడుకు చెందిన మాజీ సైనికుడు పోతనపల్లి దుష్యంత్ హైదరాబాద్‌లో మృతిచెందాడు. బొడ్డపాడు మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో మృతదేహాన్ని మంగళవారం పలాస నుంచి బొడ్డపాడు వరకూ ర్యాలీగా తీసుకువెళ్లారు. అనంతరం మృతదేహం వద్ద బొడ్డపాడు గ్రామస్థులు నివాళులర్పించారు.

నేల ఆరోగ్యాన్ని రక్షించాలి

పలాసరూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి):ప్రకృతి వ్యవసాయంతో నేలతల్లి ఆరోగ్యం రక్షించాలని ప్రకృతి వ్యవసాయం డీపీఎం పూజారి సత్యనారాయణ తెలిపారు. మోదుగులపుట్టిలో అవుగాన తిరుపతరావు ఏర్పాటుచేసిన ప్రకృతి వ్యవసాయ సహజ వనరుల కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రకృతివ్యవసాయ సిబ్బంది సూర్యనారాయణ, ఎన్.నాగరాజు, రైతు సంఘ నేత అవుగాన షణ్ముఖరావు, ఐసీఆర్‌పీ ఎస్.పాపారావు, వెంకటలక్ష్మి, తిరుపతిరావు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో పరిశీలించి.. కూలీలతో ముచ్చటించి

● బోరుభద్ర, ఉమిలాడల్లో పర్యటించిన నేషనల్ లెవల్ మానిటరింగ్ బృందం సభ్యులు

సంతబొమ్మాళి, జూలై22(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరుభద్ర, ఉమిలాడ పంచాయతీల్లో రాజస్థాన్‌కు చెందిన నేషనల్ లెవల్ మానటరింగ్ టీం, హెచ్‌ఆర్‌ఎం బృందం సభ్యులు సునీల్ బంతా, నామాసింగ్ మంగళవారం పర్యటించారు. క్షేత్రస్థాయిలో ఉపాధి పనులను పరిశీలించారు. ఆయా పంచాయతీల్లో ఉపాధిహామీ కూలీలు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, గృహనిర్మాణ పనులపై లబ్ధిదారులతో ముచ్చటించారు. ఉపాధిపనులు గ్రామానికి ఎంతదూరంలో చేస్తున్నారు, సకాలంలో బిల్లు అందుతుండడంపై లబ్ధిదారులను అడిగితెలుసుకున్నారు.స్వయంశక్తి సంఘాలు పనితీరు, రుణాలు సకాలంలో అందడం, రుణాలతో నిర్వహించే స్వయంఉపాధి కార్యక్రమాలపై ఆరాతీశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సుధాకర్, ఎంపీడీవో జయంత్‌ప్రసాద్, ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో సిద్దార్థ, ఏపీవో నర్సింహమూర్తి, హరిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రమేష్ ఏపీఎంలు శ్రీనివాసరావు,సూర్యనారాయణ, అంజిత్‌కుమార్ పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

సమ్మెకాలం ఒప్పందాలు అమలు చేయాలి



కాశీబుగ్గ పాతబస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న శానిటేషన్ కార్మికులు

కాశీబుగ్గ, జూలై22(ఆంధ్రజ్యోతి): సమ్మెకాలం ఒప్పందాలు అమలు చేయాలని, సమస్య పరిష్కారానికి సంఘ నాయకులతో ప్రభుత్వం చర్చలు జరపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సీహెచ్ మురుగన్, కె.వెంకట్, ఎం.రవి,శంకర్ కోరారు. కాశీబుగ్గలో మునిసిపల్ కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమం మంగళ వారానికి ఆరోరోజుకు చేరింది.

●ఇచ్ఛాపురం/ఆమదాలవలస, జూలై 22(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని పారిశుధ్య కార్మికులు చేపడుతున్న సమ్మె మంగళవారం కొనసాగింది. ఇచ్ఛాపురం, ఆమదాలవలస మస్టర్ కార్యాలయాల వద్ద నిరసన చేపట్టారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన చర్చల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి ప్రకటించడంతో తాత్కాలికంగా సమ్మెను విరమిస్తున్నామని,బుధవారం నుంచి విధుల్లో చేరనున్నామని మున్సిపల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు సంతోష్, రమేష్ పట్నాయక్ తెలిపారు.

బర్డ్‌ఫ్లూపై అపోహలు విడనాడాలి: ఏడీ

పాతపట్నం, జూలై 22(ఆంధ్రజ్యోతి):బర్డ్‌ఫ్లూపై అపోహలు విడనాడాలని ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ మంచు కరుణాకరరావు కోరారు. మంగళవారం పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సమీపంలోని ఆంధ్రా-ఒడిశా అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చనిపోయిన కోళ్ల రవాణా జరుగుతున్నాయన్న సమాచారంమేరకు అప్రమత్తమై పాతపట్నం, మెళియాపుట్టిలోగల అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద పశువైద్యసిబ్బందిని విధుల నిర్వహణకు ప్రత్యేకంగా నియమించినట్లు తెలిపారు. ఆయన వెంట డాకర్లు అనిల్, మైనిక,కిరణ్ ఉన్నారు.

నిరుపేద కుటుంబాలను గుర్తించాలి

నరసన్నపేట, జూలై 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిరుపేద కుటుంబాలను గుర్తించాలని పీ-4 పథకం నియోజకర్గ ప్రత్యేకాధికారి, ఉద్యానవనశాఖ ఏడీ రత్నాల ప్రసాదరావు సూచించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పోలాకి, నరసన్నపేట మండలాల పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలకు పీ-4 పథకం శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి అనురాధ, తహసీల్దార్లు ఆర్. సత్యనారాయణ, శ్రీనివాసరావు, ఎంపీడీవోలు వెంకటేష్ ప్రసాద్, రవికుమార్ పాల్గొన్నారు.

ఎరువుల కోసం ఎగబడిన రైతులు

ఎల్.ఎన్.పేట, జూలై 22(ఆంధ్రజ్యోతి):పెద్దకోట-1,-2 రైతుసేవాకేంద్రాల వద్ద ఎరువుల కోసం రైతులు ఒక్కసారిగా పెద్దసంఖ్యలో ఎగబడ్డారు. మంగళవారం ఎరువులు పంపి ణీచేస్తామని వ్యవసాయశాఖ సిబ్బంది ద్వారా తెలుసుకున్న రైతులు ఉదయానికే రైతు సేవాకేంద్రాల వద్దకు చేరుకున్నారు.రైతులంతా ఒక్కసారిగా ఎగబడడంతో ఏవో సింహా చలం జోక్యంచేసుకొని యూరియా బస్తాలు 880, డీఏపీ440 బస్తాలు ఉన్నాయని, అం దరికీ సరిపోతాయని, ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదని రైతులను సము దాయించి పంపిణీని సజావుగా నిర్వహించారు.

విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగులను విలీనం చేయాలి

పలాస, జూలై 22(ఆంధ్రజ్యోతి):కాంట్రాక్టు పద్ధతిపై విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులను ఆ సంస్థలో విలీనం చేయాలని కాంట్రాక్ట్ విద్యుత్ సిబ్బంది కోరారు.ఈ మేరకు పలాస బ్రాంచ్ 1104 అధ్యక్షుడు గార రాజారావు, ప్రధాన కార్యదర్శి వి.గిరికి మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఉద్యోగసంఘ నాయకులు మాట్లాడుతు 20 ఏళ్లగా పనిచేస్తున్నా ఇంతవరకూ ఉద్యోగ భద్రల లేదని, చాలీచాలని వేతనాలతో కుటుంబాలను ఈడ్చుకొస్తున్నామని తెలిపారు.

కలుపు నివారణ మందుల పిచికారీ

నరసన్నపేట/నందిగాం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులు వరి ఎదల్లో ముమ్మరంగా కలుపునివారణ మందులు పిచికారీ చేస్తున్నారు. రెండు మూడురోజులుగా వర్షాలు కురవడంతో కలుపు మందులు కొనుగోలు చేసేందుకు రైతులు ఎరువుల దుకాణాల వద్ద బారులుతీరుతున్నారు.నరసన్నపేట మండలంలో ఈఏడాది 4,300 ఎకరాల్లో ఎదలు వేశారు. కంబకాయి, సుందరాపురం, పారశెల్లి, చోడవరం, మామిడివలస, జమ్ము, మాకివలస, కోమర్తి, యారబాడు, ఉర్లాం, నడగాం, కరగాం తదితర గ్రామాల్లో కలుపు మందులు పిచికారీ చేసేం దుకు కూలీలుదొరక్క రైతులు అవస్థలు పడుతున్నారు. నందిగాం మండలంలోని పలు గ్రామాల్లో రైతులుపొలం పనుల్లో నిమగ్నమయ్యారు. ఒక్కసారిగా వ్యవసాయ పనులు ప్రారంభమం కావడంతో కూలీరేట్లు పెరిగాయ రైతులు చెబుతున్నారు.

అన్నిరకాల ఎరువుల బఫర్‌స్టాక్: ఏవో

టెక్కలి, జూలై 22(ఆంధ్రజ్యోతి):ఖరీఫ్ సీజన్‌లో అవసరమైన అన్నిరకాల ఎరువులు బఫర్‌స్టాక్ సిద్ధం చేశామని ఏవో శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పలు పలు సచివాలయాలు ద్వారా రైతులకు వ్యవసాయశాఖ అధికారులు ఎరువులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో కామేసు,దుర్గారావు, నారాయణ, గండి చంద్రరెడ్డి పాల్గొన్నారు.

బాలలకు ఆర్థిక సాయం

టెక్కలి:నరసన్నపేట, జూలై 22(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట మండలంలోని దేవాదికి చెందిన అనాథలైన బాలలు మోహిని, యోగితలకు టెక్కలికి చెందిన అభయం యువజనసేవా సంఘంసభ్యులు దాతలు ద్వారా రూ.50వేలు సేకరించిఅందజేశారు. మోహిని, యోగిత తల్లి స్వాతి ఇటీవల క్యాన్సర్‌తో, తండ్రి కృష్ణ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయంవిదితమే. ఈ సందర్భంగా సేకరించిన నగదు అభయం యువజన సేవా సంఘ అధ్యక్షుడు దేవాది శ్రీనివాసరావు, సింహాచలం, పూర్ణాచారి, రమేష్, గోవింద్ అందజేశారు. సంతబొమ్మాళి మండలంలోని గోవిందపురానికి చెందిన రెయ్యమ్మ తల్లి యువజన సంఘం సభ్యులు రూ.25వేలు అందజేశారు.

ఉద్యానవన పంటలపై దృష్టి సారించాలి


కోటబొమ్మాళి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మెట్టప్రాంత రైతులు తక్కువ నీటితో సాగు చేసే ఉద్యానవన పంటలను దృష్టి సారించాలని ఏవో ఎస్.గోవిందరావు తెలిపారు. కొత్తపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రైతులకు యూరియా, డీఏపీ పంపిణీచేశారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు శిమ్మ సింహాచలం, ఏఈవో బి. అరుణ, వీఏఏ సాయికిరణ్ పాల్గొన్నారు.

● నరసన్నపేట, జూలై 22(ఆంధ్రజ్యోతి): వరి సాగులో అవగాహనతో అధిక దిగుబడులను సాధించవచ్చని ఏవో సూర్యకుమారి తెలిపారు. లుకలాం, కామేశ్వరిపేట గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో శిరీష పాల్గొన్నారు.

●నందిగాం, జూలై 22(ఆంధ్రజ్యోతి): వరిసాగులో యూరియా వాడకాన్ని తగ్గించాలని ఏవో పి.శ్రీకాంత్‌వర్మ సూచించారు. హర్షబాడలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.

ట్యాపులు లేక.. తాగునీరు వృథా

టెక్కలి, జూలై 22(ఆంధ్రజ్యోతి): టెక్కలి పంచాయతీలోని శంబాన, మెట్ట, అక్కపు వీధులు, ఎన్టీఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో కుళాయిలకు ట్యాప్‌లు లేకపోవడంతో నీరు వృథాగా పోతోంది. పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కుళాయిలకు ట్యాప్‌లు బిగించకపోవడంతో నీరు వృథాగా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే తాగునీటి పైపులకు ట్యాప్‌లు ఏర్పాటుచేసి నీటి వృథాను అరికట్టాలని బీజేపీ నాయకులు చిట్టిబారికి లింగరాజు కోరారు.



మెట్టవీధి సమీపంలో ట్యాప్ లేకపోవడంతో వృథాగా పోతున్న నీరు